క్లుప్తంగా

మే 10న జాతీయ లోక్ అదాలత్



పొన్నూరు: న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏకా పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కోర్టు హాలులో బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడే క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, మనోవర్తి, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని న్యాయమూర్తి తెలిపారు. అధిక కేసులు రాజీపడే విధంగా బార్ అసోసియేషన్ సభ్యులు సహకారం అందించాలని తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ బాజీ సాహెబ్, పిల్లి విజయ్‌కుమార్, కంచర్ల సుబ్బారావు, సదానందరావు, వసంతబాబు, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చేబ్రోలు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుంటూరు రూరల్ పరిధిలో..

గుంటూరు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు, ఇతర కారణాల వల్ల డీ12 సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాసరిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని చౌడవరం, దాసరిపాలెం, ఓబులునాయుడుపాలెం, నాయుడుపేట, కేవీపీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శ్రీనివాసరావుతోట, ఎంజీ నగర్, 60 అడుగుల రోడ్డు, కృష్ణబాబు కాలనీ, జోసఫ్‌నగర్, వీఐపీ రోడ్డు, చుట్టుగుంట, లాలుపురం సబ్‌స్టేషన్ పరిధిలో లాలుపురం, వై జంక్షన్, లిగాయపాలెం, పొత్తూరు, అంకిరెడ్డిపాలెం, చల్లావారిపాలెం, ఆదర్శనగర్, తదితర ప్రాంతాలలో సరఫరా ఉండదని చెప్పారు. ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అంతరాయానికి వినియోగదారులు గమనించాలని తెలిపారు.

స్టూడెంట్ కిట్ నిల్వ ఉంచే కేంద్రం పరిశీలన

చేబ్రోలు: రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసే స్టూడెంట్స్ కిట్లు నిల్వ ఉంచే కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ అనీల్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర(స్టూడెంట్స్ కిట్ల)ను నిల్వ ఉంచే ప్రాంతాన్ని ఏఎంఓ పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టూడెంట్ కిట్‌లో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్ తదితరులు నిల్వ ఉంచటానికి తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ చక్రవర్తి, సువర్చల, హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

క్రీస్తు జీవం కలిగిన దేవుడు

గుంటూరు రూరల్: ఏసు క్రీస్తు జీవం కలిగిన దేవుడని ఆయనను నమ్మినవారికి ఆయన కృప ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని కృపామిని స్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. గత రెండు రోజులుగా నల్లపాడు రోడ్డు హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఎదురుగా జరుగుతున్న 19వ అంతర్జాతీయ కృపా మహాసభలు రెండవ రోజు కొనసాగాయి. ప్రత్యేక ప్రార్థనలను ఉదయం బ్రదర్ మాథ్యూస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన క్రీస్తుని భక్తులు లక్షలాదిగా పాల్గొన్నారు.

నేడే ఏకలవ్య విగ్రహావిష్కరణ

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని అమరావతి రోడ్డు నగరాలు ప్రధాన రహదారి ఠాగూర్ రైస్ మిల్లు ఎదురుగా జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏకలవ్యుని విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రధాన నిర్వాహకులు మేడా లక్ష్మయ్య, కావడి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆహ్వాన కమిటీ నాయకులు కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: తమ కళాశాల ఎంబీఏ విద్యార్థులకు ప్రముఖ బహుళజాతి ఆర్థిక సాంకేతిక సంస్థ పాలసీబజార్ ప్రాంగణ ఎంపికలో రూ.5.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభించడం ఆనందకరమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. శుక్రవారం చౌడవరంలోని కళాశాలలో పాలసీబజార్ ప్రాంగణ నియామకంలో 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత పొందారన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీకృష్ణ, సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె సురేష్‌బాబు అభినందించారు.

అడుగంటిన భూగర్భ జలాలు..

- అల్లాడుతున్న జనం
- ఎండిన చెరువులు..
- పట్టించుకోని అధికారులు



నీటి ట్యాంకర్ వద్ద ప్రజలు

పొన్నూరు: ఎండలు మండుతున్నాయి. చెరువులు నిండుకున్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. అధికారులు చర్యలు అంతంతమాత్రమేగా ఉన్నాయి. మండలంలోని కొండమూది ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే గ్రామంలో తాగునీటికోసం బారులు తీరుతున్న బిందెలు, ట్యాంకర్ల వద్ద నీటి కోసం నెట్టుకుంటున్న దృశ్యాలు కనపడుతూనే ఉన్నాయి. ఏప్రిల్‌లోనే తాగునీటి కష్టాలు తారాస్థాయికి చేరితే మరో మూడు నెలలు అవస్థలు తప్పవు.

దాహం కేకలు..

వేసవికాలంలో కూడా పుష్కలంగా నీటితో కళకళలాడే రెండు తాగునీటి చెరువుల్లో నీరు నింపని కారణంగా ఎండిన చెరువులు కొండమూది గ్రామ ప్రజలను వెక్కిరిస్తున్నాయి. దీంతో ప్రజలకు తాగేందుకు గుక్కెడు నీరు లభించక అల్లాడిపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నడూ నీటి కొరత వచ్చిన సందర్భం రాలేదని ప్రజలు చెబుతున్నారు. కానీ ఈ ఏడాది గ్రామస్తులకు తీవ్రంగా తాగునీటి సమస్య ఏర్పడింది. సాగునీటి కాలువల ద్వారా నీటిని నిల్వ చేయని కారణంగా చెరువులు ఎండిపోవడంతోనే కష్టాలు మొదలయ్యాయి. గత నెల 31న సాగునీటి కాలువల ద్వారా స్టోరేజ్ ట్యాంకులో నిల్వ చేసిన నీరు అడుగంటడంతో నీటి కష్టాలు తారాస్థాయికి చేరాయి. దీంతో గ్రామంలో నీరులేక పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అయితే కొందరి స్వార్థంతోనే తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువుల అభివృద్ధి పేరుతో నీరు నింపని కారణంగానే ఈ దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఏప్రిల్ 1 నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని ఏర్పాటు చేస్తామన్న అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. గ్రామంలో నీటి సమస్య ఏర్పడినా ఇప్పటి వరకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేసే విధంగా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నీరు లేక అడుగంటిన మంచినీటి చెరువు

స్వచ్ఛంద సంస్థల ట్యాంకర్లపైనే ఆధారం

కొండమూది గ్రామంలో నీటి కొరత ఏర్పడినా ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. తాగునీటి కోసం ట్యాంకర్ల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యను గుర్తించిన పలు స్వచ్ఛంద సంస్థలు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జనాభాకు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

15 నుంచి ట్యాంకర్ల ద్వారా నీరందిస్తాం..

కొండమూదిలో నీటి సమస్య లేకుండా చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 15వ తేదీ నుంచి నిడుబ్రోలు నుంచి రోజుకు 14 ట్యాంకర్లతో నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నాం. తాగునీటి చెరువులలో చెత్తను మాత్రమే తొలగించి 15వ తేదీ నుంచి సాగునీటి కాలువల ద్వారా నీటిని నింపేందుకు చర్యలు చేపడుతున్నాం. పూడిక తీత పనులు ప్రస్తుతం నిలిపి వేశామని, పూడిక తీయడం వలన నీరు పాడయ్యే అవకాశాలు ఉండటంతో ఆ పనులు చేపట్టడం లేదు.

–నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పొన్నూరు: జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకలలో పార్టీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఎండేటి వెంకటసుబ్బయ్య, నాయకులు చింతలపూడి మురళీకృష్ణ, ఆలూరు శేషు, దేవరకొండ గోపి, గేరా సంజీవ్, సుశోభిత, వేముల మూర్తి రాజు, సాయి, కిరణ్ పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో..



పూలే విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్

జ్యోతిరావు పూలే స్ఫూర్తితో సమాజంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పూలే జీవితాన్ని పాఠ్యాంశంగా పెట్టాలి
–కవి, డాక్టర్ కత్తి పద్మారావు



పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మారావు

పొన్నూరు: పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్లో కవి డాక్టర్ కత్తి పద్మారావు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. లుంబినీవనంలో ప్రతిష్ఠించిన జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే 19వ శతాబ్దంలో ఆవిర్భవించిన విద్యావిప్లవ జ్యోతులని అన్నారు. మొదటి దళిత ఉపాధ్యాయులని, స్త్రీ విద్యకు ప్రథమ పాఠశాలను నిర్మించిన గొప్పవారని కొనియాడారు. ప్రతి మండలంలో పూలే విగ్రహాలు, లైబ్రరీలు నిర్మించి, వారి జీవిత చరిత్రలను పాఠ్య గ్రంథాలుగా పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత మహాసభ కోశాధికారి వేము మాధవ్, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణకుమారి, గేరా ప్రసన్నకుమారి, దాసరి శ్యామల, జొన్నలగడ్డ రాణి పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో..



ఏఎన్‌యూలోని పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ సుదర్శన్

ఏఎన్‌యూ: భారతీయ సామాజిక ఉద్యమాల పితామహుడు జ్యోతిరావు పూలే అని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ పూలే– అంబేడ్కర్ అండ్ ఇంగ్లిష్ ట్రెనింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సుదర్శన్ బాలబోయినే అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహాత్మ జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అతిథులు, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐపీఎస్ అధికారిణి షేక్ షరీన్ బేగం మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలను, సాంఘిక దురాచారాలను రూపుమాపడం కోసం జ్యోతిరావు పూలే తన జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు. రెక్టార్ రత్నశీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, పాలకమండలి సభ్యుడు ఆచార్య కే సుమంత్ కుమార్, ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ప్రిన్సిపాల్స్ ఎం.సురేష్ కుమార్, కె.వీరయ్య, ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, అంబేడ్కర్ అధ్యయన కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్.అశోక్ కుమార్, బాబు జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పి.జె.రత్నాకర్ తదితరులు ప్రసంగించారు.

పెదకాకానిలో..

పెదకాకాని: భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు జ్యోతిరావుపూలే దంపతులు అని పెదకాకాని గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలి

పొన్నూరులో నిరసన ర్యాలీ నిర్వహించిన ముస్లింలు



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

పొన్నూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం బిల్లు వలన ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే ఆ బిల్లును రద్దు చేయాలని కోరుతూ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఐలాండ్ సెంటర్ నుంచి ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షులు మగ్బుల్ బేగ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అన్ని మతాల వారికి కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ఈ చట్టం వలన ముస్లింల పూర్వీకులు ధార్మిక కార్యక్రమాల కోసం దానం చేసిన ఆస్తులను కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ధార్మిక సంస్థ అయిన వక్ఫ్ బోర్డులో అన్యమతాల వారిని బోర్డు సభ్యులుగా నియమించడం, ఇస్లాం మతంపై విశ్వాసం లేని వారిని అడ్మిన్లుగా నియమించడం దారుణమని పేర్కొన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ స్థలాలకు లిమిటేషన్ చట్టాన్ని వర్తింప చేయడం, మసీదులు, ఈద్గాలు వంటి వాటి దస్త్రాలను అడగటం వంటి చర్యలు ముస్లిం సమాజంపై కేంద్రం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్రం వెంటనే వక్ఫ్ సవరణ చట్ట బిల్లును రద్దు చేయాలని నినాదాలు చేశారు. ర్యాలీలో అంజుమన్ కమిటీ గౌరవాధ్యక్షులు షేక్ మహమూద్, కార్యదర్శి షేక్ బాజీ, ఉపాధ్యక్షులు మొల్లా నసీరుద్దీన్ బాషా, కోశాధికారి ఎండీ గౌస్, సంయుక్త కార్యదర్శులు మౌలాలి, షేక్ మజీత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



చేబ్రోలు: స్పీడు బ్రేకర్లు గమనించక పోవటంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురవటంతో యువకుడికి గాయాలైన ఘటన మండలం నారాకోడూరులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గుంటూరు ఇందిరా ప్రియదర్శిని కాలనీకి చెందిన లంకవరపు రమేష్, చేబ్రోలు వచ్చాడు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై గుంటూరు బయలు దేరాడు. నారాకోడూరు జెస్కూల్ ఎదురుగా జీబీసీ రహదారిపై ఇటీవల నూతనంగా స్పీడ్ బ్రేకర్లు వేశారు. వీటిపై పెయింటింగ్ మార్కు వేయకపోవటంతో గమనించికపోవటంతో స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ముఖానికి, కాళ్లు, చేతులకు గాయాలైన బాధితుడిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎండీఎస్ పద్ధతి ద్వారా భూసారం పెంపుదల



నవధాన్య విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న ఏఓ శ్రీనివాసనాయక్

చేబ్రోలు: రైతులు పీఎండీఎస్ పద్ధతిలో విత్తనాలు సాగు భూమిలో వేసుకోవడం ద్వారా భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందని, పశువులకు మేతకు ఉపయోగపడుతుందని చేబ్రోలు మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాస నాయక్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి రైతు సేవా కేంద్రంలో 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ కిట్స్‌ను సామూహికంగా తయారు చేసి శుక్రవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ప్రధాన పంట వేసే 50 రోజులు ముందుగానే నవధాన్యాలు వేసే విధానాన్ని ప్రీ మాన్సూన్ డ్రైసోయింగ్ (పీఎండీఎస్) అంటారని తెలిపారు. కేవలం జనుము, జీలుగా, పిల్లి పెసరలు మాత్రమే కాకుండా రైతులు కొంత ఆదాయాన్ని కూడా పొందవచ్చునన్నారు. 365 రోజులు భూమిని కప్పి ఉంచడం వలన నేల గుల్లబారుతుందని అందరూ కూడా పీఎండీఎస్ వేసుకోవాలని సూచించారు. డీఎల్‌ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ పీఎండీఎస్ వేయడం వలన నేల కోతకు గురికాదని, దీని వలన భూమి ఉపరితలంపై ఉండే సూక్ష్మజీవులు అధిక వర్షాలకు కొట్టుకుని పోకుండా ప్రధాన పంటకు మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో మైలా వెంకటరామరాజు వీరలక్ష్మి, శ్యాంబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అభిలాష్, అదుషా పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేయాలి



చేబ్రోలు: బూత్ లెవల్ ఆఫీసర్లు ఓటర్ల జాబితా నవనీకరణ కోసం ఇంటింటి సర్వే చేయాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ టీవీ విజయలక్ష్మి అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈఆర్‌ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా నవనీకరణ కోసం సంబంధిత ఫారంలను పూర్తి చేయాలని కోరారు. మార్పులు చేర్పుల తరువాత వందశాతం పారదర్శకంగా ఉండాలన్నారు. ఓటర్ల నమోదుకు, తొలగింపులకు, అడ్రసు, జెండర్ తప్పుల సవరణలకు సంబంధిత ఫారంలను పూర్తి చేసే విధానాన్ని తెలియజేశారు. ఓటరు జాబితా మార్పు, చేర్పుల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎటువంటి తప్పులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబుల్ ఓటర్లు ఉంటే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు కే శ్రీనివాసశర్మ, డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతం చేయడమే మన లక్ష్యం

బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయటమే మన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ అందుకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో నియోజకవర్గం నాయకులతో సమావేశం నిర్వహించారు. బలసాని మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాల దిశగా కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో పేదలు అందుకున్న సంక్షేమ పథకాలను నేడు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అమలు చేయకుండా ఏవిధంగా మోసం చేసిందో వివరించాలని సూచించారు. అనంతరం కార్యకర్తలు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాల దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలి




వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: పేదల పాలిట ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏటుకూరు బైపాస్‌రోడ్డులోని నియోజకవర్గం కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బలసాని మాట్లాడుతూ నిమ్న కులాలు, సమాజానికి దూరంగా ఉన్న వర్గాలను అక్కున చేర్చుకుని, వారికి విద్య ప్రాధాన్యతను తెలియచేశారన్నారు. పూలే దంపతుల కృషి వల్లే నేడు బాలికా విద్య పెరిగిందని చెప్పారు. సమాజంలో మహిళలు ఉన్నత స్థానాల్లో నిలుస్తున్నారంటే ఆ దంపతుల చలువేనని కొనియాడారు. సమాజాభివృద్ధికి ఆనాడే ఆలోచించి బాటలు వేసిన గొప్ప సంఘ సంస్కర్తలు ఆ దంపతులని కొనియాడారు.

చెత్త నుంచి సంపద సృష్టించడమే ధ్యేయంగా పనిచేయాలి



నంబూరు డంపింగ్‌యార్డులో గది నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో డీపీఓ నాగసాయికుమార్

పెదకాకాని: చెత్త నుంచి సంపద సృష్టించడమే ధ్యేయంగా పనిచేయాలని డీపీఓ నాగసాయికుమార్ అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు వద్ద వాచ్‌మెన్ గది నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీపీఓ నాగసాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో పది వేలకు పైగా జనాభా ఉన్న పది గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో పర్యవేక్షించాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పెదకాకాని మండలంలోని పెదకాకాని, నంబూరు గ్రామాలను ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. డంపింగ్ యార్డు(ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్లలో చెత్త నుంచి వానపాము ఎరువు తయారు చేయడం తద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడటంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. తడి చెత్త పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. తొలుత లక్షరూపాయల వ్యయంతో నిర్మించే వాచ్‌మెన్ గది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మోరం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జొన్న నూర్పిడి యంత్రం బోల్తా

- ముగ్గురు మహిళా కూలీలకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



తీవ్ర గాయాలైన తిరుపతమ్మ

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ జొన్న నూర్పిడి యంత్రం బోల్తా పడిన ఘటనలో ముగ్గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలు గ్రామ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పొన్నూరు రూరల్ మండలం నండూరు గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళా కూలీలు జొన్న నూర్పిడి యంత్రంతో కొద్ది రోజులుగా ఇక్కడ కూలీ పనులు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్న ఒక పొలంలో పనులు ముగించుకొని మరో పొలంలో నూర్పిడి పనులు చేయటానికి నూర్పిడి యంత్రంతో వెళ్తున్నారు. ట్రాక్టర్ మీద, నూర్పిడి యంత్రం మీద మహిళా కూలీలు కూర్చున్నారు. పంట కాలువ దాటే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ నూర్పిడి యంత్రం బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. కొణితల తిరుపతమ్మకు నడుం, ఛాతీకి బలమైన గాయాలవటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. శివమ్మ, చిన్న కుమారిలకు గాయాలవటంతో 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న తిరుపతమ్మను గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోతే చర్యలు



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ బండారు వెంకటరంగారావు

గుంటూరు మెడికల్: వైద్య సిబ్బంది నిర్ణీత పనివేళల్లో అందుబాటులో లేకపోతే తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బండారు వెంకటరంగారావు అన్నారు. శుక్రవారం ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని మెడికల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు.